# సన్మానం

● యన్. శివానంద్ ●

## ఆకలి... ఆకలి... ఆకలి! ఈ కలికాలంలో ఆకలి తీర్చుకోవడం అంత సులభం కాదు.

అన్నపూర్ణలాంటి ఈ ఆంధ్రదేశంలో రోజూ ఆకలి కేకలు పెడుతూ అర్థాకలితో బ్రతుకులు వెళ్ళబుచ్చుకునే అభాగ్యులు కోకొల్లలు. ఆ జాబితాలో అమృతవల్లి కుటుంబాన్ని కూడా చేర్చుకోవచ్చు.

ఆ రోజు కూడా అమృతవల్లి వంట చేయలేదు. పిల్లలు 'ఆకలని గోల పెడితే వెళ్ళి మీ నాన్నను అడగండి' అని అరవాలనుకుంది. కాని ఆకలితో పీక్కుపోయిన వారి ముఖాలు చూసి ఏమీ అనలేకపోయింది. ఆకలికి పేగులు అరుస్తున్నాయి. తనకే ఇలావుంటే ఇంక పిల్లలు ఎలా తట్టుకోగలుగుతారు.

అమృతవల్లి పెద్దబ్బాయికి పదిహేనేళ్ళు, తరువాత వాడికి పన్నెండు, ఆ తర్వాత ఆడపిల్లకి ఏడేళ్ళు, ఆకరివాడికి ఐదేళ్ళు.

పెద్దబ్బాయి అప్పుడే పెద్దవాడయిపోయాడు. ఓ పాత నవల ముందేసుకొని ఆకలి మరచిపోవడానికి ప్రయత్నిస్తున్నాడు. రెండోవాడు అదేపనిగా గ్లాసుతో కుండలో నీళ్ళు ముంచుకొని త్రాగుతున్నాడు. మిగతా ఇద్దరు ఆకలి భరించలేక వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. వాళ్ళ ఏడ్పులకు భరించలేక కిరాణా కొట్లో బిస్కట్‌లు అరువుతెచ్చి అందరికీ పంచి పెట్టింది. 'ఇంతకుమించి ఏమీ చేయలేని నా నిస్సహాయతని మీకు అర్థమయ్యేలా ఎలా చెప్పను' అని తనలో తానే కుమిలిపోయింది అమృతవల్లి.

భర్త ఇంటికి వచ్చి అన్నం పెట్టమని అడిగితే నాలుగు దులపాలని అనుకుంది అమృతవల్లి.

అమృతవల్లి భర్త రాజేందర్... గవర్నమెంట్ ఉద్యోగి. జీతం బాగానే వస్తుంది. మొదట్లో వారి జీవితం సాఫీగానే సాగిపోయేది. కొన్నేళ్ల తర్వాత రాజేందర్ త్రాగుడికి అలవాటుపడి ఆర్థికంగా, నైతికంగా పూర్తిగా దిగజారిపోయాడు. ఊరినిండా అప్పులు చేసాడు. ఇంట్లో విలువైన వస్తువులన్నీ తాకట్టు పెట్టాడు. ఆకరికి భార్యమీది నగలు కూడా అమ్మేశాడు.

అమృతవల్లి పిల్లలందరు ఏడ్చి ఏడ్చి మోకాళ్ళ కడుపులో పెట్టుకొని పడుకున్నారు. అమృతవల్లి కళ్ళు మాత్రం మూతపడలేదు.

అప్పుడు రాత్రి పదకొండు గంటలు కావస్తుంది. అప్పుడే... తలుపు మీద 'టక్ టక్ టక్' అన్న శబ్దం విని తలుపు తీసింది అమృతవల్లి.

బాగా తాగివున్న రాజేందర్ తలుపుమీద ఒరిగి ఉండడం వలన, అమృతవల్లి తలుపు తీయగానే ఎదురుగా ఉన్న ఆమెమీద తూలిపడిపోయాడు.

పడిపోయిన తన భర్తను మెల్లగా లేపి నిలబెట్టింది అమృతవల్లి.

"వంట చేయలేదు కదూ! నాకు తెలుసు నువ్వు వంట చేయవని. అందుకే హోటల్లో తినేసి వచ్చాను" రాజేందర్ నిర్లక్ష్యంగా అన్న మాటలకు ఆమెలో కోపం నిండిపోయింది. ఇంట్లో పిడికెడు బియ్యం కూడా లేనప్పుడు వంట చేయడం ఎలా సాధ్యమవుతుంది? పైగా తాను మాత్రం హాయిగా మెక్కేసి వస్తే సరిపోతుందనుకొన్నాడా? ఇంట్లో భార్యాపిల్లల ఆకలి తీర్చాలన్న ఆలోచన వుండక్కరలేదా? వీళ్లంతా ఏమయిపోతే తనకేం? భార్యాపిల్లల పట్ల ఎంత నిర్లక్ష్యం? మనసులోనే అనుకుంది. అమృతవల్లికి కోపం ఆగడం లేదు. అయినా తను నోరు పారేసుకుంటే జరిగే పరిణామం ఏమిటో తనకు తెలుసు. అందుకే కోపాన్ని దిగమింగుకొని "ఉన్న డబ్బంతా త్రాగుడికి పాడుచేయకపోతే, ఆ డబ్బుతో ఇంట్లోకి సరుకులు తెస్తే అందరికి వంట చేసేదాన్నిగా..." అమృతవల్లి నిదానంగానే చెబుతున్న మాటలు పూర్తికాకుండానే ఆమె చెంపమీద చెటాలున దెబ్బపడింది. అసలే తిండిలేక నీరసంగా ఉన్న అమృతవల్లి ఆ దెబ్బకు తట్టుకోలేక కళ్ళు బైర్లుకమ్మి క్రిందపడిపోయింది.

పడిపోయిన భార్యను కనీసం లేవదీయాలన్న

● ● ●

**కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

● ● ●



## భర్త అన్నం పెట్టమని అడిగితే నాలుగు దులపాలని అనుకుంది అమృతవల్లి.

ఇంగితజ్ఞానమైనా లేకుండా ఇష్టం వచ్చినట్లు కాళ్లతో తన్ని "నా డబ్బు... నా ఇష్టం. ఇష్టం వచ్చినట్లు తాగుతాను. ఇష్టం ఉన్నప్పుడు వస్తాను. నీకిష్టం లేకపోతే ఇంట్లోంచి వెళ్లిపో! అయినా నీ పుట్టింటి నుండి నెలనెలా ఏమైనా డబ్బు తెస్తున్నావా? సరుకులు కొనుక్కోవడానికి? అయినా నా డబ్బు నా తాగుడుకే చాలటం లేదు. మీ తిండికి కావాలంటే వెళ్లి నీ పుట్టింటి నుండి డబ్బుల మూటలు తెచ్చుకో! లేకపోతే అందరు కట్టకట్టుకొని చావండి" అంటూ ఓ మూల వొరిగి గుర్రుపెట్టి నిద్రపోయాడు రాజేందర్.

★ ★ ★

స్నేహా ఆడిటోరియం సందడిగా ఉంది. సందడంటే మామూలు సందడి కాదు. మహా సందడి. కార్లను, మోటారు సైకిళ్లను వాటికి కేటాయించిన స్థలంలో పార్కు చేసి, నగరంలోని పెద్ద పెద్ద వాళ్లంతా అక్కడికొచ్చారు.

ఆ రోజు ప్రఖ్యాత రంగస్థల నటుడు, దర్శకుడు, రచయిత అయిన కళాసాగర్‌కు సన్మానం జరగబోతుంది. ఇలాంటి సన్మానాలు అందుకోవటం ఆయనకు కొత్తకాకపోయినా, ఈ సన్మానం ముఖ్యమంత్రి చేతులమీదుగా జరగబోతుండడం విశేషం. కళాసాగర్ తన నాటక ప్రదర్శనల ద్వారా ఆంధ్రదేశాన్ని ఓ వూపువూపాడు. ఎప్పుడూ ప్రజా సమస్యలనే ఇతివృత్తాలుగా తీసుకొని వాటికి పరిష్కారాలు సూచిస్తూ నాటకాలు వ్రాసి ప్రదర్శిస్తాడు. అతని ప్రదర్శనలు చూసిన ఎంతోమంది అభ్యుదయ భావాలు అలవర్చుకున్నారు. అందుకే అతడన్నా, అతని నాటకాలన్నా జనాలకు అంతే క్రేజు. అతడు చేసిన కళాసేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారు అతనికి సన్మానసభ ఏర్పాటు చేసారు. అందుకే ఆ రోజు ఆడిటోరియంలో అంత సందడి.

సన్మానసభ అనంతరం కళాసాగర్ నాటక ప్రదర్శన కూడా ఉండటం వలన సామాన్య జనాలు కూడా ఆ హాలులో నిండిపోయారు.

ఆ కార్యక్రమం తమ కాలనీలోనే జరుగుతుండడం వలన, తనకు ఆఫీసులో అంటగట్టిన టిక్కెట్లతో తప్పనిసరై సతీసమేతంగా రాజేందర్

●●●

**ఇంట్లో విలువైన వస్తువులన్నీ తాకట్టు పెట్టాడు.**

●●●

కూడా ఆ కార్యక్రమానికి హాజరయ్యాడు.

వి.ఐ.పి.లు తమకు కేటాయించిన కుర్చీల్లో కూర్చున్నారు. ముఖ్యమంత్రి రాక కోసమే అందరూ ఎదురుచూస్తున్నారు. అంతలో ముఖ్యమంత్రి తన రక్షణ సిబ్బందితో ఆడిటోరియం చేరుకున్నాడు.

ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య కళాసాగర్‌కు ఘనంగా సన్మానం జరిగింది. ముఖ్యమంత్రి కళాసాగర్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి అతన్ని ఉచిత రీతిన కొనియాడారు. ఈ సన్మానసభలో కళాసాగర్ భార్య కూడా పాల్గొని అతని ప్రక్కనే కూర్చొని ఆనందాన్ని ఆస్వాదించింది.

సన్మానసభ అనంతరం కళాసాగర్ ప్రదర్శించిన నాటకం ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది. త్రాగుబోతుల వలన కాపురాల్లో ఎలాంటి కల్లోలాలు చెలరేగుతాయి, ఆరోగ్యాలు ఎలా పాడవుతాయి, అసలెందుకు త్రాగాలి? త్రాగి జీవితాలను ఎందుకు నాశనం చేసుకోవాలి అన్న వాదనలపై త్రాగుబోతులకు సందేశం ఇస్తూ ప్రదర్శించిన ఆ నాటకం బాగా రక్తికట్టింది. ప్రేక్షకుల ప్రశంసల వర్షం కురుస్తుండగా ఆ రోజు కార్యక్రమం ముగిసింది.

★ ★ ★

అమృతవల్లి వడివడిగా నడుస్తుంది. అది మామూలు నడకకాదు. పరుగులాంటి నడక. ఆమె వదనం కోటి మెర్క్యురీ బల్బుల కాంతితో వెలిగిపోతుంది.

ఆ రోజు కళాసాగర్ నాటక ప్రదర్శన చూసిన తర్వాత తన భర్త రాజేందర్ పూర్తిగా మారిపోయాడు. తన త్రాగుబోతు జీవితానికి స్వస్తి చెప్పి తన జీతం రాళ్లతో ఆదర్శవంతంగా జీవితాన్ని గడుపుతున్నాడు. ఇప్పుడు తన సంసారనౌక సాఫీగా సాగిపోతోంది. తన భర్తలో మార్పుకు కారణమయిన కళాసాగర్‌ను అభినందించడానికి వెళ్తోంది అమృతవల్లి.

ఎంత త్వరగా అతన్ని కలుసుకుంటానా, తన మనసులో కట్టలు తెంచుకొంటున్న ఆనందపరంపరలతో అతని కాళ్లు కడిగి ఎంత త్వరగా అభినందనాలు తెలియజేయాలా, అన్న ఆతృతతో వడివడిగా నడుస్తుంది అమృతవల్లి.

కళాసాగర్ ఉంటున్న వీధిలోకి అడుగుపెట్టగానే అమృతవల్లి కళ్లు అతని ఇంటికోసం వెతకనారంభించాయి.

బంగారు రంగుతో చెక్కిన 'కళాసాగర్' నేమ్ ప్లేట్ కనబడగానే ఆమె కాళ్లు అక్కడే ఆగిపోయాయి.

లోపలికి వెళ్లాలా వద్దా అన్న సందిగ్ధంలో పడింది అమృతవల్లి. అంత పెద్ద కళాకారుడిగా పేరు ప్రఖ్యాతులు పొందిన కళాసాగర్ పేదరాలినైన తనతో మాట్లాడడానికి ఇష్టపడతాడా? ఛీ ఛీ! ఇందేంటి తన మనసులో ఇలాంటి అనుమానాలు కలుగుతున్నాయి. ఎంతోమంది జీవితాలకు తన కళా ప్రదర్శనల ద్వారా వెలుగు నందించిన అభ్యుదయవాది పేదవాళ్లను ఛీదరించుకుంటాడా? తన మనసు పొరపడుతోంది.

లోచనాలోచనాల నుండి బయటపడి కాలింగ్ బెల్ నొక్కింది అమృతవల్లి. కరెంటు లేదేమో బెల్ మ్రోగలేదు. తలుపు కొడదామని తలుపు పైన చేయి వేయగానే లోపల గడియపెట్టి ఉండక పోవడంతో నెమ్మదిగా తలుపు తెరుచుకుంది.

లోపల కనపడ్డ దృశ్యం చూడగానే అమృతవల్లి కరెంటు షాక్ కొట్టినదానిలా అయిపోయింది.

లోపల కళాసాగర్ బాగా త్రాగిన మైకంలో తూలుతూ తన భార్యను కొడుతున్నాడు. ఆమె కాళ్లు పట్టుకొని వేడుకుంటుంది. ఆ దృశ్యం చూసిన అమృతవల్లి నమ్మలేకపోయింది. తన కళ్లు తప్పుగా చూసాయేమోనని మనసుకు సర్ది చెప్పుకుంటుంది. కాని అది నిజం. ఎవరూ నమ్మలేని నచ్చినిజం.

అక్కడ ఒక్క క్షణం కూడా వుండాలనిపించ లేదు తనకు. ఆమెకు తెలియకుండానే ఆమె కాళ్లు వెనక్కి తీసుకెళ్తున్నాయి.

'చెప్పిన ఆదర్శాలను ఆచరణలో పాటించలేని వాళ్లకు సన్మానాలు చేసి, అభినందించాలా? లేక ఆచరించలేని వాళ్లు చెప్పిన ఆదర్శాలను పాటించి జీవితాలను చక్కదిద్దుకున్న వాళ్లను అభినందించాలా?' అనే ప్రశ్నలు అమృతవల్లి మస్తిష్కంలో చోటుచేసుకోగా ఆమె చకచకా తన ఇంటివైపు సాగిపోయింది. ●

---

## విజయపథంలో నాగార్జున

ప్రెసిడెంటుగారి పెళ్ళాం, రక్షణ, వారసుడు చిత్రాల విజయోత్సవ నటుడు నాగార్జున ఇవ్వేడు నటిస్తున్న అల్లరి అల్లుడు చిత్రం షూటింగ్ దశలోనే ఇతని పర్ఫార్మెన్స్ బావుందని చిత్ర పరిశ్రమలో చెప్పుకుంటున్నారు. నాగార్జున నటిస్తున్న రామ్‌గోపాల్ వర్మ చిత్రం కూడా ఇతనికి ఎనలేని కీర్తి తెస్తుందని సినీ పండితులు జోస్యం చెబుతున్నారు.

- మానేపల్లి సంపత్‌బాలకృష్ణ.

